# తప్పనిసరి

పురాణం సూర్యప్రకాశరావు

రాంబాబుగారింట్లో వివాహ సన్నాహాలు అట్టహాసంగా జరిగిపోతున్నాయి. చుట్టపక్కాలంతా ఇసక వేస్తే రాలకుండా ఇల్లంతా నిండిపోయారు. పిల్లలంతా బయటరోడ్డు కడ్డంపడి అల్లరి చేస్తున్నారు. బాజా బజంత్రీల సమ్మేళన ధ్వనులకి ఆవూరువూరంతా మారు మ్రోగిపోతోంది.

ఆ తెల్లవారుఝామునే ఆత్మీయులూ, అభిమానులూ అయినవాళ్ళ ఆశీర్వచనాల మధ్య అనూరాధ వివాహం అతివైభవంగా జరిగిపోయింది.

"ఎంతఘనంగా జరిపారు!" అని మెచ్చుకున్నారంతాను!

* * *

ఆరోజు ఆదివారం. అనూరాధ వివాహం జరిగి ఆనాటికి వారం అయింది. దూరపు బంధువులు, స్నేహితులు పెళ్ళి అయిపోయిన రెండవనాడే తిరిగి వెళ్ళిపోయారు. ఇక మిగిలిందల్లా భార్య తోబుట్టువులు, తన వేపు దగ్గరబంధువులు కొంతమంది ఉండిపోయారు. వారుకూడా రేపటెల్లుండిలో వెళ్ళిపోవచ్చు.

రాంబాబు నెత్తిమీదనించి పెళ్లితాలూకు బాధ్యతలు ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. చుట్టపక్కాలకి వీడ్కోలు ఇవ్వటంలోనూ, పెళ్ళికి తెచ్చిన చిన్నా పెద్దా ఎరువు సామానులు ఎవరివి వారికి అప్పచెప్పటంలోనూ ఊపిరి సలపకుండా ఉంది.

వీధి అరుగుమీద కూర్చుని రాసుకుంటూన్న రాంబాబు ముఖమెత్తి ఆశ్చర్యంగా "ఎప్పుడొచ్చావుపార్వతీఊర్నించి" అన్నాడు.

పార్వతి అరుగుమీద కూర్చుంటూ "ఈ ఉదయమే వచ్చాం" అంది.

"మీ నాన్న కూడా వచ్చాడా?"

"ఆc!"

"అంత్యక్రియలు సవ్యంగా జరిగాయా అమ్మా"—రాంబాబు చేతిలో కలం క్రింద పెడుతూ అడిగాడు.

"ఏదో ఉన్నదానిలో ఉన్నంతగా జరుపుతున్నారు. ఏముంది బాబూ! ఇంటికయిన పెద్ద చనిపోతే సామాన్యసంసారాలు కోలుకోవటం మాటలా? ఊరంతా అప్పులు. [illegible] తెలియదు. ఎటొచ్చీ మీం చూసుకున్నా ఒక్కగా నొక్క కొడుకు నెత్తిమీదపడింది బాధ్యత" - పార్వతి కళ్లు చెమ్మగిల్లాయ్.

రాంబాబు సానుభూతి వ్యక్తం చేశాడు. క్షణంపోయింతర్వాత అతనే "ఆడపిల్లలున్నారా?" అని ప్రశ్నించాడు.

"ఒక్కతే ఉంది. పెళ్ళి అయిందిలెండి. గుడ్డిలో మెల్ల. లేకుంటే మా అన్నయ్య నుయ్యో గొయ్యో చూసుకోవాల్సిందే."

"అమ్మాయి పదేపదే బాధపడింది. నువ్వు లేకుండానే నీ పరోక్షంలో ఆమెవివాహం జరిగిపోయింది. పైన ఉన్నట్టుంది వెళ్ళమ్మా." అంటూతనపనిలో తనునిమగ్నుడైపోయాడు.

పార్వతిమధ్యహాలులో కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్న కొత్త ముఖాల వేపుచూస్తూ పైకివెళ్ళి గుమ్మంముందు నిలబడి "అనూరాధా" అని పిలిచింది మెల్లగా.

ముందు బాల్కనీలో నిలబడి అన్యమనస్కయైఉన్న అనూరాధ కి గొంతు వినిపించలేదు. ఆమె ఆలోచనలో ఆమె ఉండిపోయింది.

పార్వతి బిగ్గరగా నవ్వుతూ "ఇప్పుడాలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందిలే" అంటూ ప్రవేశించింది.

అనూరాధ ఈ ధోరణికి సిగ్గుపడుతూ "ఎప్పుడొచ్చావు పార్వతీ ఊర్నించి?" అని ప్రశ్నించింది.

పార్వతి చాపమీద కూర్చుంటూ "ఉదయం బండిలో" అంది.

"అయితే ఇప్పటికి తీరిందన్నమాట రావటానికి?"—అనూరాధ కోపం నటించింది.

"ఫర్వాలేదు అనూ! ఈమాత్రం కోపానికైతే తట్టుకోగల్ను. గుండెలు చేత్తో పట్టుకుని మేడ మెట్లు ఎక్కాను. పిడుగులు పడలేదుగాని మెరుపు మెరిసింది. అంతే!" అంది వ్యంగ్యంగా నవ్వుతూ పార్వతి.

"అయితే నన్నంత మూర్ఖురాలుగా భావిస్తున్నావన్నమాట?"

"[illegible] ఏముంది? నీ వివాహానికి నే రాలేకపోయానంటే నువ్వు బాధపడ్డంలో ఆశ్చర్యం ఏముంది; బాధపడి కోపగించటంలో అసందర్భం ఏముంది? అందుకని అలాగన్నాను."

అనూరాధ మెత్తబడి "పోనీలే పార్వతీ! ఒక్కొక్కప్పుడు పరిస్థితు లలా తటస్థపడతాయి. కోపగించుకోలేదు గాని బాధపడ్డాను" అంది. క్షణం పోయింతర్వాత "కానుగాని ఇందాకేమిటి అన్నావు?" అంటూ ఉత్సుకతతో ప్రశ్నించింది.

"ఏమన్నాను?"

"ఎందు కాలోచించాలి. అంత అవసరమేముంది?"

"అదా! భర్తదగ్గర అనుసరించ విషయాలు ఎలా నటించాలా అని ఆలోచించాలి"

అనూరాధ "నటించటమా!? అదేమిటి పార్వతీ అలా మాట్లాడుతావు.?" అంది ఆశ్చర్యంగా.

"అవును మరి. ఒక వేళ అతని ప్రవర్తన మనం ఆశించినదానికి విరుద్ధంగా ఉంటే తెచ్చిపెట్టుకున్న ఆప్యాయత ప్రదర్శించటం కంటె గత్యంతరం ఏముంటుంది."

"అలా ఎందుకనుకోవాలి. నేనావ్యక్తిని చెడుగా భావించటం లేదు. నేను విన్నంతవరకూ అతన్ని గురించి ఎవరూ చెడుగా చెప్పలేదు."

"అహాc! అవిమంతుం ముందే ఎలా తెలుస్తుంది. జీవితంలో సంఘటనలు మనం ఊహించుకున్నదానికి భిన్నంగా జరగటంలో ఆశ్చర్యం ఏముంది?" - పార్వతి క్షణం పోయింతర్వాత నవ్వుతూ "ఊరికే పరిహాసానికన్న మాటలు. అలా ఎప్పటికీ జరగదనే నమ్ముతున్నాను. మీ దంపతులు చిరకాలం అన్యోన్యంగా ఆదరాభిమానాల్తో జీవించాలనే ఆశీర్వదిస్తున్నాను" అంటూ దీవించింది పార్వతి.

అనూరాధ పెదవులమీద చిరునవ్వు మెరిసింది. ఆమె ముఖం సిగ్గుతో ఎర్రబడింది.

పార్వతి అనూరాధ మెళ్లోని మంగళసూత్రం వేపు చూస్తూ నగలబడి నవ్వుతూ "ఒక్క ముహూర్తంలో, రెప్పపాటులో పెద్దమార్పు. ఇప్పు డితన్ని గురించి నేనున్నా నా మర్యాద దక్కదు" అంది.

ఎందువల్ల?

"[illegible]

# ★ తప్పనిసరి ★

హఠాత్తుగా ఓ కొత్త వ్యక్తి ప్రవేశించి తన బాధ్యతల్నీ, హక్కుల్నీ, సహజధర్మాలనీ తన వంతు మేరకు భుక్తం చేసుకుని అధికారకంఠంతో ఆదేశాలూ, సలహాలూ ఇస్తూ మనసులో మనసుగా వ్యవహరించే వ్యక్తి ఎవరన్నా ఉన్నారంటే ఆమె భార్య మాత్రమే అని చెప్పాలి. ఇదో విచిత్రమైన అవిభాజ్యమైన కలయిక. కొన్ని రోజుల క్రితం నీకు తెలియని అపరిచితవ్యక్తి హృదయంలో 'నీకు సగభాగం పంచి ఇచ్చాడు కూడాను. ఇది చాలా విచిత్రమైన విషయం కదూ అనూ?"—పార్వతి ఆగి అనూరాధ ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూసింది.

అనూరాధ తల వంచుకుని వింటూన్నదల్లా ముఖమెత్తి "ఏమో నాకేమీ తెలియవు" అంది అయోమయంగా.

పార్వతి పెద్దపెట్టున నవ్వేసింది.

ఉన్నట్టుండి పార్వతి తమాషా ప్రశ్న వేసింది. "నువ్వు స్వయంగా ఆయన్నిదివరకెప్పుడైనా చూశావా అనూ?"

"లేదు!" సహజమైన ధోరణిలోనే సమాధానం చెప్పింది అనూరాధ.

"చూడలేదూ? ఒక్కసారైనా?"

"లేదు. సంబంధం నిశ్చయమైందని నాన్నగారు అమ్మతో చెప్పటం విన్నాను. అంతే!"

పార్వతి నివ్వెరపోయింది. "ఆయన్ని గురించి ఒక్కమాట కూడా మీ అమ్మ నీతో చెప్పలేదూ?" అంది.

"లేదు. పెళ్ళి నిశ్చయమైందని మటుకు చెప్పింది. ఆయన గుణగణాలు అమ్మా, నాన్నగారూ మాట్లాడుకుంటుంటే విన్నాను. పెద్దవాళ్ళు అనుభవజ్ఞులు వాళ్ళకంటే మన కెక్కువ తెలుస్తాయా పార్వతీ?"

"వాళ్ళ అనుభవాన్ని, వాళ్ళ కళ్ళనీ విశ్వసించి నీ వ్యక్తిగతవిషయంలో నీ ప్రమేయం లేకుండా చేసుకున్నావన్న మాట!"

అనూరాధ చిరాగ్గా "పోనిద్దూ! ఇప్పుడా గొడవెందుకు?" అంది.

పార్వతి ఇంతవరకూ తన ధోరణికి తనే సిగ్గుపడింది. పొరబాటు సర్దుకుంటూ "అహాఁ! ఊరికే అడుగుతున్నాను. మరేమీ లేదు" అంటూ నవ్వేసింది.

అనూరాధ "అలా దేవాలయానికి వెళ్దాం పద" అంటూ లేచి బట్టలు మార్చుకుందుకు

పార్వతి ఏదో ఆలోచనలో పడిపోయింది.

ఉన్నట్టుండి హఠాత్తుగా పెద్దగొడవగా కేకలు వినిపించాయి. గదిలోంచి అనూరాధ, హాల్లోంచి పార్వతీ ఒకేసారి బాల్కనీలోకి పరుగెత్తారు. అసలు విషయమేమిటో బోధపడకపోయినా ఒక ఆడవ్యక్తిమాత్రం జుట్టు విరబోసుకుని గుండెలు బాదుకుంటూండటం గమనించారు. ఎదురుగా ఎవరో ఒకడు నిల్చుని ఉన్నాడు. కళ్ళు చింతనిప్పుల్లా ఎఱ్ఱబడ్డాయి. చామనఛాయ. లుంగీ కట్టి బనీను తొడుక్కున్నాడు. తలకు జేబురుమాలు చుట్టుకున్నాడు. ఈ ఆకారాన్ని గమనిస్తూ "ఎవడో రౌడీలాగున్నాడు. వాడి కళ్ళు చూడు ఎంత క్రూరంగా ఉన్నాయో" అంది అనూరాధ.

పార్వతి తల అడ్డంగా ఊపుతూ "వీడు మా వంశంలో చెడబుట్టాడు అనూ! ఎటువంటి ఘోర అత్యాచారాలు చెయ్యటానికైనా సంకోచించడు. వాడికి అబ్బని దురలవాటు లేదు."

"వాడు నీకు చుట్టమా?!" అంది అనూరాధ ఆశ్చర్యంగా.

"దూరపుచుట్టరికం ఉందిట. కన్నతల్లిని కూడా చంపేశాడంటారు. ఎంతవరకూ నిజమో తెలియదు."

"వీడి పేరు?"

"'గంగులు' అని పిలిచేవాళ్ళు. అసలు పేరు గుర్తులేదు. వాడి చేష్టల్ని బట్టి అలా పిలిచేవాళ్ళు."

"అటువంటి దారుణకృత్యాలు చెయ్యటానికి మనసెలా ఒప్పుతుందో?"

పార్వతి నవ్వుతూ "అందరి మనసులూ నీలాటివే అనుకున్నావా?" అంది.

"సరేలే గుడికి పోదాం పద" అంటూ మెట్లు దిగి కిందికి వచ్చారిద్దరూ...ఇంటి ముందు గలభా చిలికి-చిలికి గాలివానయ్యింది. అంతవరకూ తనకు ప్రమేయం లేనట్టుగా నిర్లిప్తంగా కూచుని రాసుకుంటూన్న రాంబాబు జోక్యం చేసుకోక తప్పలేదు. ఆడమనిషి రెక్కపట్టుకు లాగుతూ "అసలు తగాదా ఏమిటి?" అంటూ రాంబాబు మధ్యవర్తిత్వం వహించటం గుమ్మం వార నిల్చున్న అనూరాధ, పార్వతి గమనిస్తూనే ఉన్నారు. ఆడమనిషి తలబాదుకుంటూ "చూడు బాబు. నాను ఈమనిషి దగ్గర పదిరూపాయలు అప్పుతీసుకున్న మాట నిజమే. మాటప్రకారం తీర్చలేకపోనాను. ఇంకోవారం గడువిమ్మంటే ఎంత తగాదా పెంచినాడో చూడండి. ఒళ్ళంతా హూనం సేసినాడు. ఉంగరం కాజేసినాడు. బాబ్బాబు మీరు కనికరించాలి. నాసొమ్ము నాకిప్పించండి. ఆబాకీ రేపీపాటికి తీర్చకపోతే నాను ఈ రేవ కూతుర్నే కాదు." అంటూ కాళ్ళావేళ్ళా పడింది.

బహుశః ఆపేరెళ అన్నవాడు ఒకప్పుడు ఆచుట్టుపక్కల బాగా పేరుమోసినవాడయి ఉండాలి.

గంగులు గుడ్లు పెద్దవిచేస్తూ సాభినయంగా "ఈ పెద్దమనిషి చెప్పారు కాబట్టి ఒదిలేస్తున్నాను. రేపీపాటికి నాసొమ్ము నాకందకపోవాలి నీప్రాణం తోడేస్తాను." అంటూ బొడ్లో దోపుకున్న ఉంగరం దానిముందుకు విసిరేసి మరుక్షణంలో అక్కడ్నుంచి అదృశ్యుడైపోయాడు.

ఆడమనిషి రాంబాబుని మాటల్లో ఆకాశానికెత్తేసింది. రాంబాబు లోపలికివస్తూ "పాడువెధవ! ముష్టి పది రూపాయల కోసం ఆడమనిషిని చెయ్యి చేసుకుంటాడా" అని గొణుక్కున్నాడు.

అనూరాధా పార్వతీ దేవాలయానికి బయల్దేరారు. చీకటి మసకమసగ్గా అలుముకుంటోంది. వీధివార దీపాలు మినుకు మినుకు మంటూ వెలుగుతున్నాయి.

ఉన్నట్టుండి అనూరాధ "గంగులు గురించి మా నాన్న అలా అన్నందుకు నువ్వేమీ అనుకోలేదు గదా?" అంది.

"అయితే ఇంతసేపూ అదే ఆలోచిస్తున్నావన్నమాట. ఒకవేళ మనసు కష్టపెట్టుకున్నాననుకో నువ్వేం చెయ్యగలవు?"

"క్షమాపణ చెప్పుకుంటాను" అంది అనూరాధ.

"అయితే క్షమాపణ చెప్పుకోవాల్సిన అవసరం లేదులే. వాడిగురించి అభిమానం, సానుభూతి నాకేకోశానా లేవు." అంది పార్వతి.

అనూరాధ తలవంచుకుని నడుస్తోంది. పార్వతి ఏవేవో చెబుతోంది. చనిపోయిన పెదనాన్న గురించి ఆయనభార్య పెత్తనం గురించి చెప్పుకొస్తుంటే అనూరాధ ఆశ్చర్యంగా వినసాగింది. మధ్యమధ్య పార్వతి కంటనీరు పెట్టుకోవటం కూడా అనూరాధ గమనించకపోలేదు.

ఆఖరికి పార్వతి అంది. "ఇంటి బాధ్యతలన్నీ మా అన్నయ్య నెత్తిన పడ్డాయి. వీడిలాగా గాలితిరుగుళ్ళు తిరిగేవాడే అయితే ఆసంసారం వీధినపడేది. చాలా నెమ్మదైన వాడు." అని.

ఆమాటా ఈమాటా చెప్పుకుంటూ దేవాలయం చేరుకుని ఓ అరగంట గడిచిన తర్వాత తిరిగి ఇంటికి బయల్దేరారిద్దరూ. పార్వతి

సందుమలుపుదగ్గిర ఆగిపోయి "వస్తాను. అనూ! రేపు కలుసుకుంటాను" అంది.

"తప్పకుండా రావాలిసుమా!" అంటూ అనూరాధ వెళ్లిపోయింది.

పార్వతి ఇల్లు చేరుకునేసరికి అరుబయట నులకమంచంమీద తండ్రి చుట్ట కాలుస్తూ కూచుని ఉన్నాడు. ముందు చావిడీలో హరికేన్ లాంతరు మసక మసగ్గా వెలుగుతోంది. పెరట్లో రావిచెట్టు జుంయ్‌మని గోలచేస్తోంది.

"ఎక్కడికి వెళ్లావమ్మా?" అన్నాడు ముసలితండ్రి.

"అనూరాధని చూట్టానికి వెళ్లాను" అంది పార్వతి.

"కులాసాగా ఉన్నారా?"

"ఆఁ! వివాహానికి నే లేకుండా పోయినందుకు ఎంతో బాధ పడింది."

"కాదుమరి. చిన్ననాట్నుంచి పరిచయం" అన్నాడు తండ్రి. క్షణం పోయింతర్వాత మంచంమీదనుంచి లేస్తూ "అన్నం పెట్టమ్మా! ఆకలేస్తోంది." అంటూ లోపలికి నడిచాడు. పార్వతి తండ్రిని అనుసరించింది.

భోజనం చేస్తున్నంతసేపూ అనూరాధ వివాహాన్నిగురించి, కట్నాలూ కానుకలూ, లాంఛనాలు, బహుమతులూ—తను విన్నవన్నీ పార్వతి తండ్రితో, చెబుతూనే వుంది.

తండ్రి 'ఊఁ!' కొడుతున్నాడు.

భోజనం ముగిసింతర్వాత తండ్రిని ఓమారు రాంబాబుగారింటికి వెళ్ళమని బలవంతం చేసింది పార్వతి.

"వెళ్లకపోతే నేం?" అన్నాడు తండ్రి.

"కాదు వెళ్లిరా. బాగుండదు. చాలా సంతోషిస్తారాయన" అంది పార్వతి. సరేనంటూ ముసలి తండ్రి బయల్దేరాడు. వీధి గుమ్మంలో నిలబడి "బాగా పొద్దు పోయే వరకూ ఉండకుండా త్వరగా వచ్చెయ్" అంది పార్వతి. అలాగే నంటూ ముసలి తండ్రి నడుంవంచి చేతికర్రఊతంతో అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తున్నాడు. పార్వతి కళ్లు అప్రయత్నంగా చెమ్మగిల్లాయి.

"తండ్రి పెద్దవాడైపోయాడు. డెభ్భై ఏళ్లి పెదనాన్న చనిపోయాడు.

తండ్రి వయస్సుకూడా అరవైదాటాయి. తనకింకా వివాహం కాలేదు. తన తండ్రికి ఏ బాధ్యతా తీరలేదు. వయస్సు ముదురుతోంది. తనున్నంతకాలం ఇంత వండి పడేస్తుంది. తనకు వివాహం జరిగి అత్తవారింటికి వెళ్ళిపోతే తండ్రిని చూసేవాళ్లెవరు? ఆత్మాభిమానం చంపుకుని అల్లుడి పంచలో కాలక్షేపం చెయ్యాలి. ఛీ! ఏం జీవితాలు!

అయితే తను ఆశ్చర్యపడేవిషయం మరొకటి ఉంది. తన తండ్రి విచారంగా, నిరుత్సాహంగా ఉండటం తనెప్పుడూ చూడలేదు. ఆఖరికి అన్నగారు చనిపోయినప్పుడుకూడా భార్యా, కొడుకు, కూతురు నేలకు అలుముకుపోయి హృదయవిదారకంగా ఆక్రందిస్తుంటే స్థైర్యంగా నిలబడి అంత్యక్రియలకి ఏర్పాట్లన్నీ తనే చేయించాడు. తన కాశ్చర్యం వేసింది. అన్నీ ఉన్నవాడు, సంపన్న గృహస్థు రాంబాబుగారే అప్పుడప్పుడు అనూరాధ వివాహంగురించి తన దగ్గిర ఎత్తుకొంటూ దిగాలుపడిపోయేవాడు. అటువంటిది తన్నిగురించి తండ్రి ఎంత బెంగపెట్టుకోవాలి. అనూరాధకంటె తను రెండేళ్లు పెద్ద. లెక్కడితే డొక్కొడుతుంది. తన ముందుగాని చాటుగా గాని ఏ విధమైన దైన్యాన్ని, అసహాయతని, నిరుత్సాహాన్ని వ్యక్తం చేసేవాడు కాడు. ఎంత నిబ్బరం! ఏం చూసుకుని అంత ధైర్యంగా మసులుతున్నాడో. లోకులు నలుగురూ నాలుగు విధాల చెప్పుకున్నారు. అయినా స్తంభంలా నిలబడగలిగాడు తండ్రి.

లోపల గిన్నెల చప్పుడు వినిపించి పార్వతి ఆలోచనల్లోంచి తెప్పరిలి ఇంట్లోకి వెళ్ళిపోయింది. పిల్లి అంట్లగిన్నెలు దొర్లించేసింది. ఎంగిళ్ళ విస్తళ్లు ఎత్తుకుని వీధి గదిలో పక్కలు వేసి నడుం వాల్చింది పార్వతి.

"చేతనైనంతవరకూ సంబంధాలకోసం వెతుకుతునే ఉన్నాడు. ఈ ప్రయత్నంలో ఎన్నిమార్లు విఫలుడైనా, ఎంతమంది కర్కోటకత్వం ప్రదర్శించినా పల్లెత్తు మాట వాళ్ళనిగురించి నిందాపూర్వకంగా తన ముందెప్పుడూ అనడు. ఈమధ్య ఓ సంబంధం చూశాడు. అన్నీ బాగానే ఉన్నాయి. కట్నందగ్గిర పేచీ వచ్చింది. "నాకు తోచింది నేనిస్తాను. వేలమీద కట్నాలు నే పొయ్యలేను" అని తండ్రి ఖచ్చితంగా చెప్పేసరికి మూతులు విరుచుకుంటూ వాళ్ళు వెళ్ళిపోయారు. అయినా ప్రయత్నానికి లోపం లేకుండా వాకబులు చేస్తూనే ఉన్నాడు." పార్వతి క్షణం గడిచింతర్వాత అనుకుంది. "అనూరాధ అదృష్టవంతురాలు" అని. తను దురదృష్టవంతురాలనే తలపు గాఢంగా పట్టుకుంది పార్వతికి.

* * *

అనూరాధ అత్తవారింటికి వెళ్ళబోతోంది. ఆనాడు ఉదయం పనిపాటలు తొందరగా తెముల్చుకుని ఆదరాబాదరాగా తను నాలుగు మెతుకులు కతికి తం. 22




రోజంతా శ్రమపడి పనిచేసిన తరువాత



మీకు ఉత్సాహము నిచ్చుటలో



హామాంనకు సాటిలేదు!





మీ డబ్బు ఆదాయము చేయుటకుకూడా హమాంలాటి సబ్బు లేదు — ప్రతి బిళ్ల ఎంతో కాలము వచ్చును!
అది మంచి సబ్బు అని మీకు నిశ్చయముగా తెలుసు. ఎందుకంటె అది టాటా తయారు.

A TATA PRODUCT

ఇండియా పెట్టుబడితో, ఇండియా నిర్వాహకుల క్రింద, ఇండియాలోనే తయారవుతున్నది.

టాటా స్పోర్ట్స్ రెవ్యూ ప్రతి మంగళవారము, లక్ష్మివారము, శనివారముల రాత్రి 8 గంటలకు రేడియో సిలోన్‌లో వినండి



బృందావనంలో కాళియమర్దనం
(మైసూరు బృందావన్ గార్డెన్స్) —ఫోటో: ఎస్. జగన్నాథరావు (జంషెడ్పూర్.)

# ★ తప్పనిసరి ★

అన్నం పెట్టి అంటున్నీ కంచం తీసి తలుపు తాళం వేసి అనూరాధ ఇంటికి బయల్దేరింది పార్వతి

గుమ్మంలో నిలబడి ఎవరికోసమో అన్యమనస్కంగా ఎదురుచూస్తోంది అనూరాధ. పార్వతి కనిపించగానే ఇంత ముఖం చేసుకుని "నీకోసమే చూస్తున్నాను పార్వతీ. ఇంత ఆలస్యం అయిందేం?" అంటూ చెయ్యి పుచ్చుకుని లోపలికి తీసుకెళ్ళింది. లోపల గదిలో ప్రయాణ సన్నాహాలు జరుగుతున్నాయి. ఉండి ఉండి రాంబాబు ఊరంత గొంతుతో హెచ్చరిస్తున్నాడు "త్వరగా తెమలమంటూ"ను.

అనూరాధ "నేను సిద్ధంగా ఉన్నాను" బట్ "మళ్ళీ ఎప్పుడొస్తావు అనూ?" అంది.

"నాకు ఎప్పుడు రావాలని బుద్ధి పుడితే అప్పుడు రెక్కలుగట్టుకు వాల్తాను" అంది అనూరాధ.

పార్వతి నవ్వుతూ "బుద్ధి పుట్టినప్పుడల్లా రావటానికి నీ యిష్టంతో అయిపోయే పని గాదు" అంది.

"ఏం?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది అనూరాధ.

"నీకేం తెలుసు!" అంటూ తేల్చేసింది పార్వతి.

"ఎప్పుడొచ్చినా రాకపోయినా నీకోసం చూస్తూ ఓకూరు రాకతప్పదు. భగవంతుడి [illegible]



త్వరలో ఒస్తే బాగుణ్ణు" అంది అనూరాధ.

పార్వతి సిగ్గుపడింది. పైకి చిన్నగా నవ్వినా మనసులో బాధగా మూలిగింది. మరో అరగంటలో అన్నీ పూర్తయిపోయాయి. అనూరాధ బండి ఎక్కుతూ కళ్ళనీళ్ళు పెట్టుకుని "ఒస్తాను పార్వతీ" అంది. పార్వతి నోట మాట పెగల్లేదు. తలమాత్రం అడ్డంగా ఊపింది. అనూరాధతల్లి గుమ్మం నార నిలబడి అతిప్రయత్నంమీద పొంగివచ్చే దుఃఖాన్ని ఆపుకుంటోంది. రాంబాబు భార్యని ఓదారుస్తున్నాడు. ఇది సర్వసాధారణ విషయమే. పార్వతి కిదేమీ కొత్త గాదు. అనేకమార్లు ఇటువంటి సంఘటనలు ఆమె చూసింది. అయినా పార్వతి కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

ఆమెకు తల్లి లేదు!

* * *

"అనూరాధ కాపరానికి వెళ్ళిపోయింది" అని పార్వతి తండ్రితో చెప్పింది.

"అదృష్టవంతురాలు!" అని మాత్రం అన్నాడు అస్పష్టంగా.

పార్వతి నివ్వెరబోయింది. తనింతవరకూ తండ్రి కళ్ళ నీళ్ళలో ఎప్పుడూ చూడలేదు. అతను కళ్ళు తుడుచుకుంటూ భుజంమీద తువ్వాలు కప్పుకుని వీధిలోకి వెళ్ళిపోయాడు. పార్వతి వెనకాలే వెళ్ళి వీధిగుమ్మందగ్గిర నిలబడి తండ్రి సందు మలుపు తిరిగేవరకూ చూస్తూ ఉండిపోయింది. ఇంతవరకూ తండ్రి ధైర్యాన్ని బట్టి తనూ నిగ్రహంగా నిబ్బరంగా ఉండగలుగుతోంది. కేవలం అతని బాహ్య ప్రవర్తనతో వటన అనీ లోలోపల నిప్పులు చెరిగే బాధతో తండ్రి ఎంతగా కుమిలిపోతున్నదీ పార్వతి ఊహించుకునేసరికి కాళ్ళు వణికాయి. మనసు వెంటేలు పడిపోయింది. తలుపుకు అంటుకుపోయి వలవలా ఏడ్చింది. ఆమె కొతుణంలో ఏమి చెయ్యటానికీ పాలుపోలేదు. వంటగదిలోకి వెళ్ళి గోడవార కూర్చుండిపోయింది. కంఠంలో అన్నం పిల్లి మట్టుకుంటున్నా అలా చూస్తూ ఉండిపోయింది పరాగ్గా.

* * *

ముసలితండ్రి రాత్రి చాలా సేపటివరకూ నిద్రపట్టక ఆలోచిస్తూ ఉండిపోయాడు. ఇవ్వాళో సంబంధం చూశాడు. కట్నం దమ్మిడీ ఇవ్వాల్సిన అవసరం లేదు. అన్ని విధాలా తనకు నచ్చింది. అయితే పార్వతి అంగీకరిస్తుందో లేదో అని ఆలోచించసాగాడు.

తెల్లవారింతర్వాత ఈ సంబంధంవిషయం పార్వతిముందు ప్రస్తావించటానికే మనసు నానకొతింది. ఎందుకో? చివరికి ధైర్యంచేసి

ఆనాడల్లా ఆలోచించి రాత్రి భోజనాలయింతర్వాత ఈ ప్రస్తావన తెచ్చాడు.

పార్వతి ఒక్క ఉదుటున లేచి నిల్చుని "నీకు మతిపోయిందా నాన్నా?" అంది తీక్షణంగా.

తండ్రి ఏమీ మాట్లాడలేదు.

"అతన్ని గురించి నీకేమీ తెలియదనుకుంటాను" మనిషిలో ఉండకూడని ఏహ్యమైన గుణాలన్నీ వాడిలో మూర్తీభవించి ఉన్నాయి." అంది ఆవేశంగా.

తండ్రి ఈమారు నిదానంగా "నాకన్నీ తెలుసు" అన్నాడు.

"తెలిసే ఇందుకు సిద్ధపడ్డావా?" ఈమారు కంఠం రుద్ధమైంది.

ముసలితండ్రి గంభీరంగా నవ్వుతూ "నువ్వంతగా బాధపడాల్సిన అవసరం లేదమ్మా. నీకంతగా ఇష్టం లేకపోతే మరో సంబంధం చూసుకుందాం. నాది పొరబాటే. కట్నం దమ్మిడీ అవసరం లేదని వాడంటే కక్కుర్తిపడ్డాను." అన్నాడు.

పార్వతిగుండెలు కుదుటపడ్డాయి. మరో గంటలో ఆమె గాఢసుషుప్తిలో మునిగిపోయింది.

అర్ధరాత్రి ఓమారు ఆమెకు మెలకువ వచ్చింది. కళ్లు తెరచి చూసింది. మంచం మీద కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాడు తండ్రి. గుడ్డినార దీపం మసకమసగ్గా వెలుగుతోంది. తెల్లవారుఝామున మెలకువవచ్చి చూస్తే తండ్రి వాకిట్లో అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. ఇంకా చీకటిగానే ఉంది బయట.

పార్వతి లేచి కూర్చుని "రాత్రంతా నిద్రపోలేదు కాబోలు" అనుకుంది. తెల్లవారింతర్వాత చూస్తే తండ్రిముఖం నిగారించి ఉంది. కళ్లు ఎఱ్ఱబడ్డాయి. బహుశః ఆ సంబంధంగురించే ఆలోచించిఉంటాడు. కట్నం అవసరంలేదట!"

ఈవారంరోజుల్లోనూ తండ్రి బాగా నీరసించిపోయినట్టుగా అవుపించాడు. పార్వతి కంగారుపడింది. ఎప్పుడూ లేంది అస్తమానూ పరాగ్గా ఒంటరిగా ఆలోచిస్తూ గంటలతరబడి కూర్చుండిపోయేవాడు. పార్వతి జ్ఞాపకంచేస్తే నాలుగు మెతుకులు కతికి చేతికర్ర అవసరం ఉన్నా మర్చిపోయి వీధిగుమ్మంవరకూ నడిచి తిరిగి వెనక్కి వచ్చేవాడు. పార్వతి చేతికర్ర అందిచ్చేది. ఒకొక్కప్పుడు భోజనం చెయ్యటం కూడా అలక్ష్యం చేసేవాడు. పార్వతి బలవంతంచేస్తే ఆకలి లేదంటూ విసిగేవాడు.

రాత్రి ఒంటిగంటవరకూ పార్వతి ఆలోచిస్తూనే ఉంది. మంచు బాగా కురుస్తోంది. ఎముకలు కొరికే చలి. ఎన్నో విధాల ఆలోచించింది. తర్జనభర్జనలు చేసింది. మనసంతా సోదు చేసుకుంది. చివరికి ఓ నిర్ణయానికొచ్చింతర్వాత పార్వతి కళ్ళనీళ్లు తుడుచుకుంటూ అతిప్రయత్నంమీద పొంగివస్తున్న దుఃఖాన్ని అణుచుకుంటూనే నిద్రపోయింది.

ఉదయం భగవధ్ధ్యానం చేసుకుంటున్న తండ్రిపక్కగా వచ్చి కూర్చుని "నేనా సంబంధం చేసుకుంటాను నాన్నా" అంది పార్వతి.

ముసలితండ్రి "ఆశ్చర్యంగా అదేమిటి?" అన్నాడు.

"ఆనాడు ఊరికే అలాగన్నాను. మరేమీ లేదు. ఈ సంబంధం చేసుకోటానికి నాకేవిధమైన అభ్యంతరం లేదు. నిశ్చయం చెయ్యి." అంది పార్వతి.

ఆమె తొణకలేదు బెణకలేదు. ముసలి తండ్రినోట మాట పెగల్లేదు.

రాంబాబుగారి కీమధ్య ఒంట్లో ఆరోగ్యం బాగుండటంలేదని తెలిసి పార్వతి ఓమారు ఆయన్ని చూట్టానికని బయల్దేరింది. ఎంతో ఆదరంగా మాట్లాడాడు రాంబాబు. అనూరాధకి నిన్ననే ఉత్తరం రాశారట. బహుశః నాలుగయిదురోజుల్లో ఆమె రావచ్చని వారు ఎదురుచూస్తున్నారు. ఆయనఆరోగ్యం గురించి అంతగా బాధపడాల్సిన అవసరం లేకపోయినా ఆయన స్వభావాన్ని బట్టి అలా ఉత్తరం రాయాల్సివచ్చిందని పార్వతి అనుకుంది. ఏదైనా అంతే! గోరంతని కొండంత చేసుకుని బాధపడిపోతాడు.

మరోగంట గడిచింతర్వాత శెలవు తీసుకుంది పార్వతి.

* * *

ఉత్తరం రాసిన ఐదోనాటికల్లా ఆదరాబాదరాగా గుండెలు గొట్టుకుంటూ వచ్చేసింది అనూరాధ. గుమ్మంలోనుంచే రుద్ధకంఠంతో తండ్రి ఆరోగ్యం గురించి ప్రశ్నలమీద ప్రశ్నలు వేసింది. వీటన్నిటికి సమాధానంగా రాంబాబు చిరునవ్వు నవ్వుతూ మేడమీంచి "అమ్మాయీ! పైకి రావే!" ఆనందాతిశయంతో పిట్టగోడ మీద చేతులానించి ముందుకూ వెనక్కూ ఊగుతూ అన్నారు.

అప్పటికి అనూరాధగుండెలు కుదుటపడ్డాయి. ఆతర్వాతగాని పక్కగా నిల్చుని ఉన్న పార్వతిని ఆమె గమనించలేదు. సంతోషంతో పార్వతి రెండుచేతులూ పుచ్చుకుని లోపలికి తీసుకువెళ్ళింది.

ఆసాయంత్రం ఇద్దరూ కలిసి దేవాలయానికి బయల్దేరారు. పార్వతి ముందు విముఖత ప్రదర్శించినా అనూరాధబలవంతంమీద వెళ్లకతప్పలేదు. అనూరాధలో ఈ కొన్నాళ్ళలోనూ అనుకోని మార్పు కనిపించింది పార్వతికి. ఆమె వివిధయాలగురించి మాట్లాడినా ఆ విషయం భర్తకు సంబంధించినదే అయిఉండటం పార్వతికి చాలా ఆశ్చర్యం వేసింది.

చివరికి ఆ ధోరణి భరించటం కష్టమైపోయింది పార్వతికి. ప్రసంగవిషయం మార్చాలని పార్వతి చేసిన ప్రయత్నాలు విఫలమయిపోయాయి.

ఆరోజు శుక్రవారం కావటంవల్ల దేవదర్శనం కావటం అంత సులభమయిన విషయం కాదు. గర్భగుడిముందు జనం తోసుకుంటున్నారు. మర్రిచెట్టునీడని ఆశీనులయారిద్దరూను.

అనూరాధ "ఇప్పుడప్పుడే రావటం పడుతుందనుకోలేదు. బహుశః మళ్లీ రావటం అంటూ జరిగితే అది నీగురించే అనుకున్నాను" అంది.

"అయితే మళ్లీ రావాల్సిన అవసరం ఉంటుందిలే" అంది పార్వతి.

"ఏం?" అంది అనూరాధ.

"నాగురించే" నిర్వికారంగా అతిసామాన్యమైన విషయం ప్రస్తావిస్తున్నట్టు అంది పార్వతి.

"ఆఁ!!! నీపెళ్లి నిశ్చయమైందా పార్వతీ?" అనూరాధ ఆనందాశ్చర్యాల్లో ఉక్కిరిబిక్కిరై పోయింది.

"అవును."

"చాలా సంతోషం. కట్నం?" అనూరాధ ప్రశ్నించింది.

"ఆయన కట్నం పుచ్చుకోరట!"

"గొప్పవిషయం. ఆయనేం చేస్తుంటారు?"

"అది నాకు తెలియదు"

"ఆయన పేరు?"

"గం...గు...లు!"

"ఆఁ!!" అనూరాధ స్తంభించిపోయింది. లిప్తలో ఆమెముఖం ఎఱ్ఱబడిపోయింది. క్షణంపోయింతర్వాత ఆవేశంగా "నీకేమైనా మతిపోయిందా పార్వతీ. నీఅంతటి నువ్వే ఇందుకు అంగీకరించావా?" అంది.

"అవును!"

"వాడొక ఖూనీకోరు! గూండా! అమర్యాదస్తుడు. మోటుమనిషి..." అనూరాధ తన ఉనికనే మరిచిపోయింది.

పార్వతి లేచి "వస్తాను అనూ! ఇంటికి వెళ్తాను." అంటూ రెండుచేతుల్లో గుండెల్ని అదిమి పట్టుకుని చరచరా వెళ్లిపోయింది. అనూరాధ "దేవుడి ప్రసాదం పుచ్చుకోవూ పార్వతీ?" అంటూ వెంటబడినా ఆమె వినిపించుకోలేదు.

గుడిగంటలు గణగణమని చెవులు హోరెత్తిస్తున్నాయి. అనూరాధ అయోమయంగా చూస్తూ నిలబడిపోయింది. ★